పత్తి దిగుబడిని పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న తాండూరు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ లక్ష్మణ్

ధారూరు, మార్చి 24: కొన్ని సంవత్సరాలుగా పత్తి దిగుబడి నిలకడగా ఉందని దీనిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తాండూరు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ టి.లక్ష్మణ్ రైతులను సూచించారు. సోమవారం ధారూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా స్థానం ఏరువాక కేంద్రం తాండూరు వారి ఆధ్వర్యంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ వారి ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయ ప్రదర్శన, అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ డివిజినల్ వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ అధిక సాంద్రతలో పత్తిని సాగు చేయడం వల్ల పంటకాలాన్ని తగ్గించుకోవడం కాకుండా అధిక దిగుబడులను పొందవచ్చునని తెలిపారు.తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ ఎరువుల మోతాదు, నీటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సునీత, డాక్టర్ యమున, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు రత్నమాల, కేశవ, కృష్ణ, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

పరిగి, మార్చి 24 :కులకచర్ల మండలం అల్లాపూర్‌తండాకు చెందిన బాలుడు సాయి తేజ్ ఉపాధిహామీ బోర్డు పడి మృతిచెందిన సంఘటనకు సంబంధించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నిండు ప్రాణం పోయిందని పేర్కొన్నారు. సోమవారం పరిగిలోని ఆసుపత్రిలో బాలుడు సాయితేజ్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం బాలుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదువేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, ఈ సంఘటనకు సంబంధించి వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. అనంతరం పరిగి మండలం ఇబ్రహీంపూర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో పడి మృతి చెందిన నర్సింహులు పార్థివ దేహాన్ని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సందర్శించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. బాలుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిబంధనలకు పాతర

- 'పది' పరీక్షల నిర్వహణలో అనుభవం లేని వారికి విధులు
- పక్క మండలాల నుంచి నియామకాలు

పరిగి, మార్చి 24 : పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి విధుల కేటాయింపులో విద్యాశాఖ అధికారులు నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అత్యంత పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపట్టాల్సి ఉండగా విధుల కేటాయింపు దగ్గరే అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ద్వారా నిబంధనలు గాలికి వదిలారని చెప్పవచ్చు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేషన్ మొదలుకొని చీఫ్ సూపరింటెండెంట్, స్క్వాడ్ బృందాలలో విధుల కేటాయింపు వరకు సరైన నిబంధనలు పాటించలేదనే విమర్శలు వస్తున్నాయి. పరీక్షల నిర్వహణలో అత్యంత కీలకమైన చీఫ్ సూపరింటెండ్‌ల నియామకంలోను విద్యా శాఖ అధికారులు నిబంధనలు పాటించలేదనే ఆరోపణలు ఉన్నాయి. చీఫ్ సూపరింటెండెంట్‌ంట్‌ల నియామకానికి సంబంధించి విద్యా శాఖ అధికారులు అయిదు పర్యాయాలు జాబితాను మార్చడం ఈ ఆరోపణలకు మరింత ఊతమిస్తున్నది. ప్రధానంగా పరీక్షలను పూర్తిస్థాయిలో ఒంటిచేతితో నడిపించేది చీఫ్ సూపరింటెండెంట్‌లని చెప్పవచ్చు. అలాంటి ఉన్నత స్థానంలో అనుభవం గల వారిని నియమించాల్సి ఉండగా దోమ మండలంలోని ఒక పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లుగా ఇరువురిని పరీక్షల నిర్వహణలో బొత్తిగా పని అనుభవం లేని వారిని నియమించడం గమనార్హం. వారికి పని అనుభవం లేదని తెలిసి నియమించిన అధికారులు, వారు ఇరువురికి పరిగి మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సహాయకులుగా నియమించడం మరింత విడ్డూరం. సహాయకులను సంబంధిత పరీక్షా కేంద్రం గల మండలంలోని పాఠశాలల నుంచే నియమించాల్సి ఉండగా పరిగి మండలంలోని పాఠశాలల నుంచి సహాయకుల నియామకం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు. ఈ రెండు నియామక వ్యవహారాలలో అసలు మతలబు ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పరీక్షల నిర్వహణలో అనుభవం గల వారిని వదిలి పెట్టి అనుభవం లేని వారిని నియమించడం ఎందుకు, వారికి సహాయకుల నియామకాలు చేపట్టడం పలు విమర్శలకు తావిస్తుంది. ఇదిలా వుండగా ఒక పరీక్షా కేంద్రంలో 250 మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటే ఒక అదనపు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను నియమించవచ్చు. కాగా పరిగి మండలంలోని ఓ ప్రైవేటు పరీక్షా కేంద్రంలో 150 నుంచి 165 మంది విద్యార్థులే పరీక్షలు రాస్తుండగా పూడూరు మండలంలోని ఓ పాఠశాల నుంచి అదనపు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను పరిగి ప్రైవేటు పరీక్షా కేంద్రంలో నియమించడం గమనార్హం. ఇలా నియమించిన డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌కు పరీక్షల నిర్వహణ అనుభవం లేదనే కారణంగా అదే పాఠశాల నుంచి ఓ సహాయకుడిని నియమించడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఇదిలావుండగా ప్రైవేటు పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలలో ఇన్విజిలేటర్లుగా సంబంధిత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులనే నియమించడం సరైంది కాదనే వాదన వినిపిస్తుంది. ఏదైనా జరగరాని సంఘటన చోటు చేసుకుంటే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలలో పనిచేసేందుకు సరిపడ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉండగా ప్రైవేటు వారిని నియమించాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మరోవైపు మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షా కేంద్రాలలో పర్యవేక్షణ, తనిఖీలు చేసే స్క్వాడ్ బృందాలలోని సభ్యుల నియామకం సైతం సరిగ్గా జరగకపోవడం గమనార్హం. సీనియర్లను కాదని జూనియర్లను స్క్వాడ్ బృందం సభ్యులుగా నియమించడం విమర్శలకు తావిస్తున్నది. ఇన్విజిలేషన్ విధుల జాబితా రెండు పర్యాయాలు, చీఫ్ సూపరింటెండెంట్ నియామకాల జాబితాను ఏకంగా అయిదు పర్యాయాలు మార్చడం అనేక అనుమానాలు కలిగిస్తుంది. దీనికంతటికి కారణం పరీక్షల నిర్వహణ విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తి అని పలు ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. అసలు పరీక్షల నిర్వహణ విభాగంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులకు చోటు ఉండరాదని నిబంధనలు ఉన్నా, సదరు వ్యక్తికి పరీక్షల నిర్వహణలో కీలకమైన బాధ్యత అప్పగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు సరైన విధంగా పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పరీక్షల నిర్వహణ నియామకాలను వెంటనే మార్పు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం కోసం పడిగాపులు...

పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా కొనసాగుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇందులో ప్రధానంగా హాస్టల్ విద్యార్థులకు భోజన ఇక్కట్లు తప్పడం లేదు. పదవ తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పూర్తవుతాయి. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగించాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాలు కొనసాగుతున్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెట్టే సిబ్బందిని మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాలలకు రానివ్వడం లేదు. దీంతో వారు ఒంటి గంట తర్వాత వచ్చి వంట తయారు చేసి వడ్డించేందుకు సుమారు గంటన్నర సమయం పడుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. దీంతో ఇళ్ల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఇంటి వద్దే మధ్యాహ్న భోజనం చేసి వస్తుండగా సంక్షేమ హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు ఉదయం 8 గంటలకు అందించే అల్పాహారం తిని మధ్యాహ్నం 2 గంటల వరకు భోజనం కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మరోవైపు తరగతులు కొనసాగుతుండగా విద్యార్థులు కొన్నిచోట్ల భోజనాల కోసం బయటే ఉంటుండడంతో తరగతుల నిర్వహణ కష్టసాధ్యమవుతుంది. ఈ ఇబ్బందులు తొలగించాలంటే కనీసం మధ్యాహ్న భోజన సిబ్బందిని త్వరగా పాఠశాలలోకి అనుమతించి, వారు వంటశాలకే పరిమితమయ్యేలా చర్యలు తీసుకుంటే సరిపోతుందని పలువురు సూచిస్తున్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి



కారుణ్య నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులకు సన్మానం

వికారాబాద్, మార్చి 24 : ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో సుధీర్ కుమార్ అన్నారు. జిల్లా పరిషత్ ద్వారా 16 మంది అర్హులకు సోమవారం కారుణ్య నియమక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖలో ఖాళీలు లేక దీర్ఘకాలంగా కారుణ్య నియామకాలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రులు ప్రత్యేకంగా చొరవ తీసుకొని అటెండర్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా అప్ గ్రేడ్ చేసి కారుణ్య నియామకాలను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందకుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్, జిల్లా పరిషత్ సిబ్బంది చంద్రశేఖర్, వినయ్ కుమార్, బెన్నీ, గౌతమ్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించేలా చర్యలు

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి తదితరులు

వికారాబాద్, మార్చి 24 : శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి, ఈదురు గాలులకు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. వాటిలో అధికంగా ఉల్లి పంటకు నష్టం జరిగింది. సోమవారం మోమిన్‌పేట మండలం మేక వనంపల్లితో పాటు ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి జయశంకర్, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పంట నష్ట వివరాలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు పరిహారం అందించేలా చర్యలు చేపడతామని తెలిపారు . రెండు రోజులలో పంట నష్ట వివరాలను పూర్తి చేసి ఆ వివరాలను పై అధికారులకు అందజేయాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి అక్షిత రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు పెంటయ్య, శ్రీనివాసులు, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 31లోగా బంగారు రుణాలు చెల్లించాలి

పెద్దేముల్, మార్చి 24 : పెద్దేముల్ మండలం తట్టిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2020-25 వరకు బంగారంపై రుణాలు తీసుకొని తిరిగి చెల్లించని రైతులు ఈ నెల 31 వరకు రుణాలు చెల్లించాలని లేదా ఏప్రిల్ తర్వాత అట్టి బంగారాన్ని సంఘం సభ్యులు తీర్మానించి జిల్లా బ్యాంకు వారికి అప్పగించి వేలం వేయనున్నట్లు తటిపల్లి సీఈవో రాజమౌళి తెలియజేశారు. 172 మంది రైతులకు రూ. కోటి 30లక్షలు చెల్లించామని, అందులో 62 మంది రైతులు వాయిదా మీరిన సభ్యులు ఉన్నందున అట్టి రైతులు ఈ నెల 31వరకు రుణాలు చెల్లించాలని లేదా కనీసం వడ్డి చెల్లించి రిన్యూవల్ చేసుకోవాలని తెలియజేశారు. 31వరకు చెల్లించని రైతుల జాబితాను ఏప్రిల్ 1 తర్వాత సంఘం సభ్యుల తీర్మానం మేరకు జిల్లా బ్యాంకుకు అప్పగించనున్నారు. . సంఘం అభివృద్ధి చెందాలంటే రైతులు తీసుకున్న పంట రుణాలు, బంగారు రుణాలు సకాలంలో చెల్లిస్తే నే బ్యాంకు అభివృద్ధి బాటలో కొనసాగుతుందన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, పి.శివ కుమార్ తండ్రి జంగయ్య వయస్సు 34 సంలు, వృత్తి: వ్యవసాయము, నివాసము: వనంపల్లి, జల్లేడు-చౌదరిగూడ మండలం, జిల్లా రంగారెడ్డి, తెలంగాణ వాస్తవ్యులు స్థాలికం క్రింద సంపాదించిన ఆస్తిని తనఖా పెట్టుకొని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ షాద్‌నగర్ బ్రాంచి వారు లోన్ ఇవ్వడానికి నిశ్చయించి నారు. కావున ఇట్టి యొక్క ఆస్తిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచి నందు సంప్రదించగలరు. లేనిచో ఈ యొక్క ఆస్తిపై ఎటువంటి వివాదాలు లేవిధగా పరిగణించి మా క్లయింటు ముందుకు కొనసాగుతారు.

ఆస్తి వివరాలు: - కాలి ప్లాటు మేరకు 121.00 చదరపు గజములు, 101.16 చదరపు మీటర్లు సర్వేనెం. 191/అ1/1/2/1. పెద్ద ఎల్కిచర్ల గ్రామ పంచాయితీ జల్లేడు-చౌదరిగూడ మండలం, రంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ ఫరుఖ్‌నగర్. **హద్దులు :** - **తూర్పు:** 33.00 వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట రాజు భూమి, **ఉత్తరము:** ప్లాట చిన్నయ్య భూమి, **దక్షిణము:** ప్లాట రాజు భూమి.

బి.రాజశేఖర్ రాజు, అడ్వకేట్
ఇం.నెం. 12-24, నేహ్రూ కాలనీ,
షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
సెల్: 9849415189

ఆర్టీసీ బస్సు ఢీ .. ఇద్దరికి గాయాలు

బంట్వారం (కోట్ పల్లి), మార్చి 24 : ఆర్టీసీ బస్సు ఢీకొని భార్యాభర్తలకు గాయాలైన సంఘటన కోట్‌పల్లి పోలీస్ ఠాణా పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. వికారా బాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోట్ పల్లి వస్తుండగా రాంపూర్ గ్రామం నుంచి భార్యాభర్తలు వెంకటేశం శ్రీలతలు ద్విచక్ర వాహనంపై కోట్ పల్లి సంతకు వెళ్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న మూల మలుపు వద్ద బస్సు వెనుక భాగంలో ద్విచక్ర వాహనానికి తగలడంతో కింద పడి ఇద్దరికీ గాయాలయ్యాయి. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గఫార్ తెలిపారు.

గాలి దుమారం .. తృటిలో తప్పిన ప్రమాదం

కొడంగల్, మార్చి 24: నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లోని ఆయా ప్రాంతాల్లో సోమవారం దాదాపు అరగంట పాటు ఈదురు గాలులతో కురిసిన వర్షంతో భీభత్సం నెలకొంది. ఇంటి పైకప్పుకు ఏర్పాటు చేసుకున్న రేకులు గాలికి ఎగిరిపోయాయి. కొడంగల్ పట్టణంలోని ఈసా పెట్రోల్ పంప్ 163 హైవే రోడ్డు పై ఏర్పాటు చేసిన భారీ సూచిక బోర్డు నేలకొరిగింది. బోర్డు పడే సమయంలోనే ఓ వాహనం అటుగా దూసుకొని వెళ్లడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. సూచికబోర్డును తొలగించే ప్రక్రియ అధికారులు చర్యలు చేపట్టే వరకు రోడ్డుపై చాలా వరకు వాహనాలు నిలిచిపోయాయి.

ఒరిగిపడ్డ భారీ సూచిక బోర్డు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన శ్రీమతి వి. సుగుణమ్మ భర్త జ. శ్రీనివాసులు, నివాసము ఆశ కాలనీ, షాద్‌నగర్ గ్రామము, ఫరూఖ్ నగర్ మండలము, రంగారెడ్డి జిల్లా గాలి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన యేమనగా, రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్ నగర్ మండలము, షాద్‌నగర్, హాజీపల్లి గ్రామపంచాయతి, గుండ్లకుంట గ్రామ శివారులోని సర్వే నెం. 1 యందలి ప్లాటునెం. 176, విస్తీర్ణము 129.86 చదరపు గజములలో నిర్మించిన ఆసంపూర్తి గృహమును నా క్లయింటు శ్రీ జాడ పవన్ కళ్యాణ్ గారి నుండి కొనుటకు నిర్ణయించుకొని ఎల్.ఐ.సి. హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ లోన్ ఖాతా నెం. 7001290001999 ఆశ్రయించినారు. ఇట్టి పై తెలిపిన ఆస్తికి రిజిస్టర్డ్ లింక్ డాక్యుమెంటు నెం. 4828/2001 శ్రీ జాడ పవన్ కళ్యాణ్ గారి ఆధీనములో లేదు. పై కనబరచిన లింక్ డాక్యుమెంటుకు సంబంధించి ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు, హక్కులు, అధికారములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి 15 రోజుల లోపు తమ ఆక్షేపణలను క్రింద కనబరచిన చిరునామాకు తెలుపగలరు. 15 రోజులు దాటిన తర్వాత వచ్చే ఎలాంటి ఆక్షేపణలను పరిగణనలోనికి తీసుకోబడవని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

తేది: 24-03-2025

GOPAL JHAWAR, Advocate
30-141, Venkateshwara Colony,
Jadcherla-509301, Mahabubnagar Dist.
Cell : 9291211196

ఇఫ్తార్ విందును బహిష్కరిద్దాం

బొంరాస్‌పేట, మార్చి 24: కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించలేదని, ఎన్నికల్లో మైనారిటీలను సీఎం రేవంత్‌రెడ్డి ఓటు బ్యాంకులా వాడుకోవడం జరిగిందని మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మైనారిటీ డిక్లరేషన్‌లో 22 హామీలు ఇవ్వడం జరిగిందని, కానీ నేటి వరకు ఏ ఒక్క హామీని కూడా అమలు పరచలేదన్నారు. మైనారిటీ సంక్షేమ సంస్థలను పూర్తిగా నిర్లక్ష్యం వహించినట్లు తెలిపారు. రంజాన్ సందర్భంగా సీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందును బహిష్కరిద్దామని పిలుపు నిచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EAPCET NEET
ONLINE CRASH COURSE
30 days @ Rs 8888/-
TEST SERIES
5 Grand Tests @ 888/-
50% Discount Today
Call: 8645 322 633
Jatadhara Ed Tech

WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'క్షయ' నిర్మూలనలో భాగస్వాములమవుదాం

తాండూరు: అవగాహన ర్యాలీ

కొడంగల్ పట్టణంలో..

కులకచర్ల కస్తూర్బాగాంధీ పాఠశాలలో..

తాండూరు, మార్చి 24: సమాజంలోని వ్యక్తులందరూ చేయి చేయి కలిపి క్షయవ్యాధిని నిర్మూలించాలని జిల్లా ఆస్పత్రి వైద్యులు పేర్కొ న్నారు. సోమవారం జాతీయ క్షయ నిర్మూలన వారి ఆధ్వర్యంలో తాం డూరు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్లు సమిఉల్లా, గిరిధర్ మాట్లాడుతూ దేశంలో క్షయవ్యాధితో ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పొతున్నారని పేర్కొన్నారు. అంటువ్యాధులాంటి రోగాలు ప్రజలకు సోకకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటిం చాలని సూచించారు. టీబీ వ్యాధి సూక్ష్మజీవుల ద్వారా సంక్రమి స్తుందని తెలిపారు. రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్షయ రోగి క్రిములు సన్నని తుంపర్ల ద్వారా గాలిలో కలుస్తాయని, ఆ గాలిని ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు వారికి క్షయవ్యాధి సోకుతుందని తెలిపారు. అందుకు ప్రతీ ఒక్కరు తగు జాగ్రత్తలు పాటించాలని సూ చించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఛాతిలో నొప్పి, సాయం త్రపూట జ్వరం, రాత్రి సమయంలో చెమటలు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, తెమడతో పాటు రక్తం పడటం క్షయవ్యాధి లక్షణాలని తెలిపారు. క్షయవ్యాధి వచ్చినవారు బాధపడకూడదని సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయించుకొని వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తు మందులు వాడితే తగ్గుతుందన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయవ్యాధి పరీక్షలు పూర్తి ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

కొడంగల్: సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించుకొని క్షయ వ్యాధిని నివారించుకోవాలని క్షయ చికిత్స పర్యవేక్షకులు రహత్ అలీ కోరారు. పట్టణంలో స్థానిక నర్సింగ్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ కూడలిలో ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మం దులతో పాటు పౌష్టికాహారం కోసం ప్రతి నెల రూ.1000ల ఖాతాలో జయచేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాలు ఉన్న వారి కి వైద్య పరీక్షలు నిర్వహించుకునే విధంగా సహకరించాలని తెలిపారు.

కులకచర్ల: ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో సోమవారం ఎస్‌వో దేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి రకం ఎలా ఉంటుందో టీబీ సూపర్ వైజర్ గోపాల్, టీబీ హెల్త్ విజిటర్ రాజునాయక్ వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ అంటే భయపడొద్దు

పెద్దేముల్, మార్చి 24 : మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గల పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సందర్శించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత పరీక్షలు అంటే ఎవరు భయపడవద్దని అన్ని సబ్జెక్టులతో పాటు అది కూడా సబ్జెక్టేనని, కావున విద్యార్థులు ఆందోళన చెంది అయోమయంలో పడవద్దని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు గణిత పరీక్ష గురించి భయం పోయేలా ప్రోత్సహించాలి. అంతేకాకుండా పరీక్ష కేంద్రాలకు రావడానికి విద్యార్థులకు బైకులు ఇవ్వరాదని తల్లిదండ్రులే వారిని పరీక్ష కేంద్రాల వద్ద విడిచి వెళ్లాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవ కాశాలు ఉన్నందున బైకులు ఇవ్వరాదని సూచించారు. సబ్ కలెక్టర్ వెంట పెద్దేముల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సైమన్, తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మార్చి 24 : అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకం ద్వారా అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అందిస్తున్న ఆర్థిక సహాయం కోసం వికారాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం అర్హులైన విద్యార్థులు నేటి నుంచి మే 19 వరకు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైటు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అమెరికా, కెనడా, జర్మనీ, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్ళే వారికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ రూ.20 లక్షల స్కాలర్ షిప్ ను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు డిగ్రీ (సాంకేతిక , వృత్తి పరమైన కోర్సులలో) ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే GRE, GMAT లేదా TOFEL, IELTS పరీక్షలో